

బాలల
సెప్టెంబరు 2016
చంద్రప్రభ
మాసపత్రిక
రూ. 20/-
శ్రీమతి రావినూతల సువర్ణాకన్నన్‌గారి
అద్భుత సీరియల్ స్వర్ణసింహాసనం



# నిజాయితీ

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు

రాఘవపురం జమిందారు కృష్ణవర్మకు బోలెడన్ని పళ్లతోటలు ఉన్నాయి. వాటిని పర్యవేక్షించడానికి గాను రామదాసు అనే వ్యక్తిని చాలా కాలం క్రితమే కుదుర్చుకున్నాడు. రామదాసు ముక్కుకు సూటిగా పోయేమనిషి. నిజాయితీపరుడు. అందుకని అతన్ని ఎప్పుడూ పరీక్షించేవాడు కాదు జమీందార్. అది ఆయన ఇద్దరు కొడుకులకు నచ్చేది కాదు. ఏ మనిషైనా సంపూర్ణంగా స్వచ్ఛంగా వుండడు. అవసరం వస్తే ప్రలోభాలకు లొంగుతాడు. అందుచేత రామదాసును గుడ్డిగా నమ్మదు అన్నారు. అప్పుడు జమీందార్ ఆలోచనలో పడ్డాడు. తన తర్వాత తన ఆస్తికి తన ఇద్దరు పిల్లలే వారసులు, పొరపాట్న రేపు తనకు జరగరానిదేమన్నా జరిగితే.. కొడుకులు రామదాసును మాటలు, చేతలతో హింసించవచ్చు. కాబట్టి తనుండగానే రామదాసు నిజాయితీ పరుడని నిరూపించాలనుకుని.. "మీరిద్దరూ ఎలాగైనా రామదాసును ప్రలోభపెట్టి, అతను లొంగితే నాకు తెలియజేయండి, నేను అప్పటికప్పుడు అతన్ని పనిలోనుంచి తొలగించటమే కాదు. ఇకనుంచి మనుషుల్ని సంపూర్ణంగా విశ్వసించను. కాని రామదాసు నిజాయితీని ఇన్ని సంవత్సరాల తర్వాత శంకిస్తున్నాం కాబట్టి, అతను నిజాయితీ పరుడని నిగ్గుతేలితే మీరు మీ స్థాయిని మరచిపోయి అతనికి క్షమాపణ చెప్పాలి సరేనా" అన్నాడు.

వాళ్ళు "సరే"అని ఒప్పుకున్నారు.

ఒకరాత్రి జమిందారు పెద్దబ్బాయి బండి తీసుకుని రామదాసు దగ్గరకెళ్ళి తనకి బండెడు కమలాపళ్ళు అవసరం ఉందని, ఈ తోటలో ఉంటాయని ఒకాయన చెబితే వచ్చానని, దయచేసి పళ్ళిస్తేభారీ నగదు ముట్ట చెబుతాన్నాడు.

ఆ మాట వినగానే రామదాసు అగ్గిమీద గుగ్గిలమైపోయి.. పెద్దబ్బాయిని తరిమి తరిమి కొట్టాడు.

మరుసటి రోజు రెండో కొడుకు తోట దగ్గర కొచ్చి తనకి బాగా ఎదిగిన దానిమ్మ పండు వైద్యం నిమిత్తం కావాలని, కోసిస్తే పెద్ద మొత్తంలో ధనమిస్తానని ప్రలోభపెట్టాడు.

దానికి కోపం వచ్చి రెండో కొడుకుని తిట్టసాగాడు. అప్పుడు అంత పెద్ద తోటలో ఒక్క పండు కోస్తే ఏమవుతుంది? ఎవరికి తెలుస్తుంది? నీది అనవసరమైన నిజాయితీ అన్నాడు. అంతే కర్ర తీసుకుని అతని వెంట పడ్డాడు రామదాసు.

మరుసటి రోజు జమిందారు తనకూ పిల్లలకు జరిగిన వాదన తెలియజెప్పి "వాళ్ళకోసం రామదాసుని పరీక్షించడానికి ఒప్పుకున్నానని తనను క్షమించమని రామదాసుని వేడుకున్నాడు.

అబ్బాయిలిద్దరూ కూడా క్షమించమని ప్రాధేయపడ్డారు.

"చూడండి, మీ నాన్నగారు ఆతోట చూసుకోమని నాకిచ్చారు. దానికి ప్రతిఫలం కూడా ఇస్తున్నారు. అది నా సంరక్షణలో వున్నంతకాలం నా తోట. నా తోటలో నేను దొంగతనం చేయుటవేమిటి? నిజాయితీ లేని కర్తవ్యపాలన వ్యర్థం'' అన్నాడు రామదాసు.

## మీకు తెలుసా..?

*మన జాతీయ భాషలు :*

*1. అస్సామీ, 2. బెంగాలీ, 3. గుజరాతీ, 4. హిందీ, 5. కన్నడ, 6. కాశ్మీరీ, 7. కొంకణి, 8. మళయాళం, 9. మరాఠీ, 10. మణిపూరీ, 11. నేపాలీ, 12. ఒరియా, 13. పంజాబీ, 14. సంస్కృతం, 15. సింధీ, 16. తమిళం, 17. తెలుగు, 18. ఉర్దూ, 19. బోడో, 20. సంతాలీ, 21. డోంగ్రీ, 22. మైథిలీ.*

*- పి.వి. సుజాతారాయుడు, సైనిక్‌పురి*